నిర్వాసితులను ఆదుకుంటాం: కలెక్టర్


కిష్టారంలో కూలిపోయిన ఇంటిని ఎమ్మెల్యేతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సమాజ అవసరాల కోసం త్యాగం చేసిన వారిని ఆదుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కిష్టారం అంబేడ్కర్‌నగర్ సమీపంలో సీహెచ్‌పీ సైలో బంకర్లను ఎమ్మెల్యే మట్టా రాగమయి, సింగరేణి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. కిష్టారం ఓసీతో ఎస్సీ, బీసీ కాలనీల్లో దెబ్బతిన్న, కూలిపోయిన ఇళ్లను సందర్శించి బాధితులతో మాట్లాడారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సింగరేణి భూనిర్వాసితుల సమావేశంలో పాల్గొన్నారు. పలువురు బాధితులు మాట్లాడుతూ సైలో బంకర్ల వద్ద లోడింగ్ సమయంలో వచ్చే దుమ్మును నియంత్రించకపోవడంతో గాలి, నీరు కాలుష్యమై అంబేడ్కర్‌నగర్ వాసులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కిష్టారం ఓసీలో అధిక దాటితో బాంబు పేలుళ్లు నిర్వహిస్తుండటంతో ఎస్సీ, బీసీ కాలనీల్లో దాదాపు 350 ఇళ్లు దెబ్బతిన్నాయని, న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ సైలో బంకర్ కాలుష్య నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటామని, గ్రామంలోనూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఇళ్ల పునర్ నిర్మాణం కోసం జీవో వద్ద ఇప్పటికే కొంత నిధులున్నాయని, మిగిలినవి విడుదల చేయించి నిర్వాసితులకు త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ ఓసీ వచ్చిన తర్వాత కిష్టారం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, ఇక్కడి పరిస్థితులను చక్కబెడతామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని, కచ్చితంగా బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. జీఎం షాలేంరాజు, కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్‌గౌడ్, ఎంపీడీఓ నాగేశ్వరరావు, డాక్టర్ దయానంద్, ఏఎంసీ ఛైర్మన్లు దోమ ఆనందబాబు, నీరజాచౌదరి, పీవో నరసింహారావు, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు రజాక్, ఉడతనేని అప్పారావు, మోరంపూడి రవి, రావి నాగేశ్వరరావు, నరుకుళ్ల అప్పారావు పాల్గొన్నారు.

మంట నూనెలు..!



ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

పండగలకు ముందు వంటనూనెల ధరలు మండుతున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం సుంకం పెంచటంతో వంట నూనెల ధరలు భగ్గుమంటున్నాయి. పక్షం రోజుల వ్యవధిలోనే ఒక్కో కంపెనీ లీటరు నూనెపై రూ.10 నుంచి రూ.30 వరకు పెంచటం ఆశ్చర్యం కలిగించే అంశం. అంతర్జాతీయంగా ఏర్పడిన ప్రతికూల పరిస్థితులూ ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. రెండేళ్లలో ఎప్పుడూ లేనివిధంగా ధరలు పెరగటం వల్ల ప్రజలపై కోలుకోలేని భారం పడింది.

యుద్ధాల ప్రభావం..

ప్రస్తుతం ఇరాన్- ఇజ్రాయెల్, ఉక్రెయిన్- రష్యా మధ్య జరుగుతున్న యుద్ధాలు కూడా ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా భావిస్తున్నారు. పొద్దుతిరుగుడు నూనెను 60శాతం వరకు ఉక్రెయిన్, రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది. ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం వల్ల ముడిచమురు ధర పెరగటం వల్ల వంట నూనెల ధరలు మరింత మండిపోతున్నాయి. పామాయిల్‌ను అత్యధిక శాతం మలేషియా, ఇండోనేషియా నుంచి ముడిచమురు రూపంలో దిగుమతి చేసుకుంటున్నాం. ఇక్కడికి వచ్చిన తర్వాత కర్మాగారాల్లో శుద్ధిచేసిన తర్వాత రకరకాల కంపెనీలు వివిధ బ్రాండ్లతో నూనెను విక్రయిస్తున్నాయి.

ఉభయ జిల్లాల్లో..

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గృహ, వాణిజ్య అవసరాల కోసం ప్రతినెలా సుమారు 4,200 మెట్రిక్ టన్నుల వంట నూనెలు వినియోగిస్తారు. ప్రధానంగా పొద్దుతిరుగుడు, పామాయిల్, వేరుసెనగ, రైస్‌బ్రాన్, ఇతర నూనెలు వాడతారు. పెరిగిన ధరల కారణంగా ఉభయ జిల్లాల్లో వినియోగదారులపై రూ.కోట్ల భారం పడుతోంది. దసరా, దీపావళి, ఆ తర్వాత జాతీయ పండగల దృష్ట్యా ధరలు మరింత పెరిగే అవకాశముందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

దిగుమతి సుంకం పెరగటంతో..

ముడి చమురుపై దిగుమతి సుంకాన్ని 5.50 నుంచి 22 శాతానికి, శుద్ధి చేసిన వంట నూనెలపై దిగుమతి సుంకాన్ని 13.75 నుంచి 35.75 శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం గత నెలలో నిర్ణయం తీసుకుంది. తద్వారా వినియోగదారులపై భారం పెరుగుతోంది. దేశంలో అవసరాలకు సరిపడా వంట నూనెలు తయారవకపోవటం, ఇతర దేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకోవటం వల్ల ధరల్లో పెరుగుదల ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

నూనెల ధరల్లో వ్యత్యాసం (రూ.లలో)	పామాయిల్	పొద్దుతిరుగుడు	వేరుసెనగ	రైస్‌బ్రాన్
15 రోజుల క్రితం	95	113	140	120
ఈనెల 4న	125	135	150	135

ట్రిపుల్ ఐటీపై కోటి ఆశలు..!

ఈటీవీ, ఖమ్మం: రాష్ట్రంలో మరో రెండు ట్రిపుల్ ఐటీ కళాశాలలను నెలకొల్పాలని సర్కారు యోచిస్తోంది. మరోవైపు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాంకేతిక విశ్వవిద్యాలయం కొలువుదీరాలని వేలాది మంది విద్యార్థులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఏజెన్సీ జిల్లాగా పేరొందిన ప్రాంతంలో సంప్రదాయ ఇంజినీరింగ్ కోర్సులతో పాటు మరికొన్ని కొత్త కోర్సులు అందుబాటులోకి వస్తే నిరుపేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు పడనున్నాయి.



ఎదురుచూస్తున్న విద్యార్థి లోకం

బాసరలోని రాజీవ్‌గాంధీ సాంకేతిక, వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ)కి అనుబంధంగా మరో రెండు కొత్త ప్రాంగణాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే విద్యాసంవత్సరం నుంచే ఒక్కటైనా అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తోంది. సంప్రదాయ ఇంజినీరింగ్ కోర్సులతోపాటు అదనంగా బయోటెక్నాలజీ, ఫార్మా టెక్నాలజీ వంటి ఇంజినీరింగ్, బయో సైన్స్ సమ్మేళనంతో కూడిన మల్టీ డిసిప్లినరీ కోర్సులను అందుబాటులోకి తీసుకురానుంది. ఇప్పటికే ఉత్తర తెలంగాణలో ట్రిపుల్ ఐటీ కళాశాల ఉన్నందున ఈసారి దక్షిణ తెలంగాణలో ఏర్పాటుచేయాలన్నది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా పేరు ప్రధానంగా తెరపైకి వస్తుండటంతో ఇక్కడి విద్యార్థి లోకం కోటి ఆశలతో ట్రిపుల్ ఐటీ కోసం ఎదురుచూస్తోంది.

మంత్రులు దృష్టి సారిస్తే..

ఇప్పటికే ఖమ్మం మినహా మిగతా ఉమ్మడి జిల్లాల్లో విశ్వవిద్యాలయాలు కొలువుదీరాయి. ఖమ్మం జిల్లాలో విశ్వవిద్యాలయం నెలకొల్పాలని విద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. రాజకీయ పరంగానూ ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. గడిచిన శాసనసభ ఎన్నికల్లో హస్తం పార్టీకి అత్యధిక అసెంబ్లీ స్థానాలు కట్టబెట్టింది. గతంలో జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇక్కడి ప్రజలు ఏమి కోరినా కాంగ్రెస్ ప్రభుత్వం కాదనబోదని హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలో ట్రిపుల్‌ఐటీ కళాశాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నెలకొల్పేలా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పట్టుబట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

కొలువుదీరితే ఉమ్మడి జిల్లాకు మహర్దశే

హైదరాబాద్ తర్వాత విద్యాహబ్‌గా విరాజిల్లుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు ఆస్థాయిలో విద్యాసంస్థలు కొలువుదీరలేదన్న నిరాశ విద్యార్థి లోకాన్ని వెంటాడుతోంది. ఖమ్మం జిల్లాలో 1,211, భద్రాద్రి జిల్లాలో 1,299 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలున్నాయి. ఏటా దాదాపు 35 వేల మంది విద్యార్థులు పదోతరగతి పూర్తిచేసుకుంటున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ట్రిపుల్ ఐటీ కళాశాల నెలకొల్పితే విద్యాపరంగా అద్భుతమైన ప్రగతి సాధించే అవకాశాలు ఉన్నాయి. ట్రిపుల్ ఐటీ కళాశాల ఏర్పాటైతే ఇంటర్ రెండేళ్లు, బీటెక్ నాలుగేళ్లు మొత్తం ఆరేళ్ల కోర్సు అందుబాటులోకి రానుంది. ఫలితంగా వేలాది మంది ఏజెన్సీ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందనుంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచి బాసర దూరంగా ఉండటం, ట్రిపుల్ ఐటీ కోర్సులపై పెద్దగా అవగాహన లేకపోవటంతో ఇప్పటివరకు ఉభయ జిల్లాల నుంచి విద్యార్థుల ప్రాతినిధ్యం సరైన స్థాయిలో లేదు. ఎక్కువ మంది పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యాభ్యాసం వైపు మొగ్గుచూపుతున్నారు. ఒక్కసారి ట్రిపుల్ ఐటీ కళాశాలలో చేరితే విద్యార్థి ఇంజినీర్‌గా బయటకు వచ్చే అవకాశముంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

పంటల బీమా.. పట్టాలెక్కేనా..?

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం


ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోతున్న రైతులను ఆదుకునే మార్గాలు కనిపించటం లేదు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫసల్ బీమా పథకం రాష్ట్రంలో అమలుకు నోచుకోవటం లేదు. కొన్నేళ్లుగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పంటలు నష్టపోతున్న రైతులకు అరకొరగా పరిహారం చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకొంటోంది. ఫసల్‌బీమా పథకంతో అనుసంధానమై సమగ్ర పంటల బీమా పథకాన్ని రూపొందించి అన్నదాతలను ఆదుకుంటామని కాంగ్రెస్ సర్కారు నిర్ణయించినా మార్గదర్శకాలు వెలువడలేదు.



నాపేరు జరుపుల పూల్యా. మాది ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాకాసితండా. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రెండెకరాల వరి పొలం కొట్టుకుపోయింది. పెట్టుబడి రూ.80వేలు నీటిపాలయ్యాయి. మరో రూ.లక్ష వెచ్చించి మోకాలు లోతు ఇసుక మేటలను తొలగించాను. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నాను.

అన్నదాతలకు గుండెకోత

ఉభయ జిల్లాల్లో సెప్టెంబర్ మొదటి వారంలో అతిభారీ వర్షాలు, వరదలు అన్నదాతలకు గుండెకోత మిగిల్చాయి. ఖమ్మం జిల్లాలో 68,345, భద్రాద్రి జిల్లాలో 2,982 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. జిల్లా అధికారులు పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినా ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటల బీమా పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ముందే విడుదల చేసి ఉంటే ఎంతోకొంత ఉపశమనం లభించేదని వాపోతున్నారు.



ఫసల్ బీమా పథకం విధివిధానాలపై స్పష్టత లేదు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వెలువడితే తదనుగుణంగా పథకం అమలవుతుంది. ఇటీవల భారీ వర్షాల వల్ల నష్టపోయిన పంటల వివరాలను సర్కారుకు నివేదించాం.

- పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి, ఖమ్మం

పొంచి ఉన్న 'ఈశాన్య' ముప్పు

ఇప్పటికే నైరుతి రుతుపవనాలు రైతులకు వేదన మిగిల్చాయి. ముున్ముందు ఈశాన్య రుతుపవనాలు ఏమేరకు పంటలను నష్టపరుస్తాయేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది పంటలు చేతికందే సమయం (డిసెంబర్)లో సంభవించిన మిగ్‌జాం తుపాను వల్ల ఖమ్మం జిల్లాలో 82,211, భద్రాద్రి జిల్లాలో 13,608 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. ఇందుకు సంబంధించిన పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో యాసంగి సాగుపై తీవ్ర ప్రభావం పడినట్లు అన్నదాతలు చెబుతున్నారు.

ఏళ్ల తరబడి నిరీక్షణ..

కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్‌బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలుచేసేందుకు గతంలో భారాస సర్కారు విముఖత చూపింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉండగా.. రైతుల వాటాగా 20 శాతం చెల్లింపు విధానం అమల్లో ఉంది. భారాస సర్కారు 40శాతం వాటా చెల్లించటానికి నిరాకరించటంతో బీమాపథకం అమలు కాలేదు. రైతులపై ఆర్థిక భారం పడకుండానే పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. అయితే ఫసల్‌బీమా పథకం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలు వెలువడలేదు. పంటల బీమా పథకం అమలుకు ఈఏడాది సైతం రైతులు నిరీక్షించాల్సిందే.

అందుబాటులోకి 'సామాజిక ఆర్థిక ముఖచిత్రం' పుస్తకం

ఖమ్మం నగరం: రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన 'తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖ చిత్రం 2024' పుస్తకం కలెక్టరేట్‌లోని జిల్లా ప్రణాళిక శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉందని సీపీఓ శ్రీనివాస్ తెలిపారు. కావాల్సినవారు రూ.150 నగదు చెల్లించి ఈ పుస్తకం పొందవచ్చన్నారు. టీజీపీఎస్సీ గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఈ పుస్తకం ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రగతి, ఆర్థిక వృద్ధి తదితర అంశాలు పుస్తకంలో ఉంటాయన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి: అదనపు కలెక్టర్

ఖమ్మం నగరం: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో అర్హులైనవారు నవంబర్ 6లోగా ఓటర్లుగా నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ శుక్రవారం తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు ఫారం-19లో ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని, నవంబర్ 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించి డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి, డిసెంబర్ 30న తుది జాబితా ప్రకటిస్తామన్నారు. 2024 నవంబర్ 1వ తేదీకి ముందు ఆరేళ్లలో కనీసం మూడేళ్లు సెకండరీ స్కూల్ కంటే తక్కువ స్థాయి కాకుండా విద్యా బోధనలో నిమగ్నమైన ఉపాధ్యాయులు ఓటరుగా నమోదుకు అర్హులని తెలిపారు. మూడేళ్లు విద్యాబోధన చేసినట్లు సంబంధిత అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం జత చేయాలని సూచించారు.

సార్వత్రిక ప్రవేశాల గడువు పొడిగింపు

ఖమ్మం విద్యావిభాగం: 2024-25 విద్యాసంవత్సరానికి ఓపెన్ స్కూల్‌లో పదోతరగతి, ఇంటర్‌లో ప్రవేశాల గడువును ఈనెల 31 వరకు పొడిగించినట్లు డీఈఓ సోమశేఖరశర్మ, ఓపెన్ స్కూల్ జిల్లా సమన్వయకర్త మద్దినేని పాపారావు శుక్రవారం తెలిపారు.

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా కల్పన


ఎం.కల్పన


వి.శివరంజని

ఖమ్మం న్యాయవిభాగం: ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా ఎం.కల్పన నియమితులయ్యారు. ప్రస్తుతం ఆ స్థానంలో పని చేస్తున్న కె.వి.చంద్రశేఖర్‌రావు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఆయన డీఎల్ఎస్ఏకు ఇన్‌ఛార్జి కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఖమ్మం అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా వి.శివరంజని నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె హుస్నాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్నారు. హైకోర్టు రిజిస్ట్రార్ ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ఏపీపీగా పి.స్వప్న నియమితులయ్యారు. ప్రస్తుతం ఆమె నర్సంపేట కోర్టు ఏపీపీగా పనిచేస్తున్నారు. ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు ఏపీపీగా పనిచేస్తున్న కె.రాజారావు కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టుకు బదిలీ అయ్యారు.

నేటితో ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

ఖమ్మం విద్యావిభాగం: డీఎస్సీలో అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు శనివారం ఒక్కరోజే సమయముంది. 17 కౌంటర్లను విద్యాశాఖ శుక్రవారం ఏర్పాటు చేసింది. 367మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించాల్సి ఉంది. ఇప్పటివరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 372, ఎస్‌జీటీలు 644, భాషా పండితులు 40, పీడీ/పీఈటీలు 19 మంది ధ్రువపత్రాలను పరిశీలించారు. 1:3 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసినా ర్యాంకు ఆధారంగా ఉద్యోగమొచ్చే అవకాశం లేనివారు పరిశీలనకు రావటం లేరు. ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమాన్ని డీఈఓ సోమశేఖరశర్మ శుక్రవారం పర్యవేక్షించారు.

జిల్లా అథ్లెటిక్స్ జట్టులో 30 మంది

ఖమ్మం క్రీడలు: ట్రయథ్లాన్ జిల్లా జట్ల ఎంపికకు పటేల్ స్టేడియంలో పోటీలను శుక్రవారం నిర్వహించారు. 30 మంది క్రీడాకారులతో జిల్లా జట్టును ఎంపిక చేశారు. ట్రయథ్లాన్ అండర్-14 జట్టులో స్థానం కోసం క్రీడాకారులు 60 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, బ్యాక్‌త్రో, 600 మీటర్ల పరుగు లక్ష్యాలను పూర్తిచేసేందుకు శ్రమించారు. ఇదే తరహాలో అండర్-16, 18, 20 విభాగాల్లో పోటీపడ్డారు. ఎంపికైన జిల్లా జట్టు త్వరలో హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనాల్సి ఉంటుందని అథ్లెటిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి షఫీ అహ్మద్ చెప్పారు. డీవైఎస్ఓ సునీల్ రెడ్డి, శిక్షకుడు గౌస్ పాల్గొన్నారు.

ఆర్థిక భారం లేకుండా సౌర విద్యుత్తు: సీఎండీ వరుణ్‌రెడ్డి

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సౌర విద్యుత్‌ను ప్రోత్సహిస్తున్నట్టు టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. సిరిపురంలో శుక్రవారం పర్యటించారు. రైతు వేదికలో గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గృహాలు, వ్యవసాయ పంపుసెట్లకు పూర్తిగా సౌర విద్యుత్‌ను సమకూర్చేలా రాష్ట్రంలో రెండు గ్రామాలు పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపికయ్యాయన్నారు. అందులో ఒకటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి కాగా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క కృషితో ఆయన నియోజకవర్గంలోని సిరిపురం ఎంపికైందన్నారు. రెండు గ్రామాల్లో గృహ, వాణిజ్య అవసరాలతోపాటు రైతుల విద్యుత్తు మోటార్లకు ఉచితంగా సౌర విద్యుత్ సమకూరుస్తామన్నారు. ప్రజలపై ఆర్థిక భారం పడకుండా ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. నెడ్‌క్యాప్ వైస్ ఛైర్‌పర్సన్ అనిలా, ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సురేందర్, వైరా డీఈ హీరాలాల్, ఏడీఏ అనురాధ, గ్రామీణ ఏఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


అధికారులతో కలిసి పరిశీలిస్తున్న వరుణ్‌రెడ్డి

కొలువుల కోటీశ్వరుడు..

◆ నాలుగు ఉద్యోగాలు సాధించిన యువకుడు



కోటేశ్వరరావు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే

కొందరు ఆర్థికంగా స్థితి పరులై ఉంటారు. ఇంకొందరు బాగా చదువుకుని జ్ఞాన సంపద పెంచుకుంటారు. ఇలాంటి వారు తమ లక్ష్య సాధన క్రమంలో మధ్యలోనే విజయ ఫలాలు దక్కినా గమ్యం చేరేవరకూ విశ్రమించరు. ఆ కోవలోకి చెందిన వ్యక్తే ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రాజులదేవరపాడుకు చెందిన కోమటి కోటేశ్వరరావు.

రాజులదేవరపాడుకు చెందిన రైతు పుల్లయ్య, లక్ష్మీల చిన్న కుమారుడు కోటేశ్వరరావు. పదో తరగతి వరకు మామునూరు ఉన్నత పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ మధిరలో చదువుకున్నాడు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు కళాశాలలో టీటీసీ పూర్తి చేశారు. టీటీసీ అభ్యసిస్తున్న సమయంలోనే ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలన్న పట్టుదల పెరిగింది. ఈ క్రమంలో కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్ రావటంతో దానికి ప్రిపేరయ్యారు. 2016లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. పోలీసు శిక్షణలో ఉన్నప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైనా పోస్టులు లేకపోవటంతో నిరుత్సాహానికి గురయ్యారు. అనంతరం 2018లో సివిల్ కానిస్టేబుల్‌కు ఎంపికయ్యారు. అందులో చేరకుండా ఏఆర్‌లోనే కొనసాగుతూ 2023 జులైలో గ్రూప్-4 పరీక్ష రాశారు. రెండు నెలల క్రితం వచ్చిన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 62వ ర్యాంక్ దక్కించుకున్నారు. తన లక్ష్యం ఉపాధ్యాయ కొలువు. రెండు నెలలపాటు సెలవు పెట్టి 2024 డీఎస్సీకి సిద్ధమయ్యారు. తాజా ఫలితాల్లో ఎస్జీటీలో జిల్లా స్థాయిలో 19వ ర్యాంక్ సాధించారు.

‘ఏ ప్రవేశ పరీక్షకూ శిక్షణ తీసుకోలేదు. అకాడమీ పుస్తకాలతో సొంతంగా పరీక్షలకు సిద్ధమయ్యా. ప్రస్తుతం కొత్తగూడెం స్పెషల్ పార్టీలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నా. సెలవు పెట్టి డీఎస్సీకి సిద్ధమయ్యా. ఉపాధ్యాయుడిగా వృత్తిలోకి రాబోతుండటం సంతోషంగా ఉంది. - కోటేశ్వరరావు

ఆయన పేరే ‘దయ’.. మానవతలో సాటి లేరయా!!

గురువుంటే అక్షర జ్ఞానాన్నివ్వడమే కాదు.. విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవడం

విధులంటే వేళలకే పరిమితమవడం కాదు.. పరిధి మించి బడి అభివృద్ధికి పూనుకోవడం

ఉద్యోగం అంటే ఓ కర్తవ్యమే కాదు.. అభాగ్యులకు, సమాజానికి చేతనైన సాయమందించడం

ఈ ఆలోచనలను ఆచరణలో పెట్టడం వల్లే ఆ గురువుకు దరఖాస్తుతో నిమిత్తం లేకుండా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఆయన పేరులోనే ‘దయ’ ఉండటం కాదు.. చేసే ప్రతిపనిని అదే గుణంతో కొనసాగిస్తుంటారు.

“విద్యాలయాల్ని దేవాలయంగా భావిస్తా. రోజూ పాఠశాల సమయానికే చేరుకోవడం, నా వంతుగా ఆ రోజు ఏం చేయాలో ఆలోచించి దాన్ని ఆచరణలో పెట్టడం చేస్తా. నా సేవల్ని గుర్తించి పలువురు ఐఏఎస్ అధికారులు, రాష్ట్ర, జాతీయ స్థాయి సంస్థలు, ప్రభుత్వాలు ఇచ్చిన అవార్డులు, పతకాలు ఎంతో సంతృప్తిని కలిగిస్తాయి.”

- ప్రభుదయాళ్, ప్రధానోపాధ్యాయుడు

పాల్వంచ, న్యూస్‌టుడే

కొత్తగూడెం పట్టణం రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, మండల విద్యాధికారి (ఎంఈఓ) డా. మారుముడి ప్రభుదయాళ్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించారు. ‘నేడు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం’ సందర్భంగా ఆయనపై ప్రత్యేక కథనం.

ఏపీపీఎస్సీ గ్రేడ్-2 క్యాడర్‌లో ఉపాధ్యాయ వృత్తి ఆరంభించారు ప్రభు దయాళ్. తొలి పోస్టింగ్ 1993లో.. టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దక్కింది. అక్కడ 2000 సంవత్సరం వరకు ఎంఈఓ, ఎంపీడీఓ, స్పెషల్ ఆఫీసర్ హోదాల్లో విధులు నిర్వహించారు. 2004-2011 వరకు భద్రాచలం ఐటీడీఏ బీఈడీ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేశారు. ఏటా ఉత్తమ ఫలితాలు సాధించి జాతీయ ఉపాధ్యాయ మండలి నుంచి దిల్లీ స్థాయిలో అవార్డు అందుకున్నారు. 2011-18 వరకు కొత్తగూడెం పట్టణం మేదరబస్తీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించారు. ఏటా పలువురు విద్యార్థులు బాసర ఐఐటీలో ప్రవేశాలు పొందేలా తీర్చిదిద్దేందుకు కృషిచేశారు. ఆ తర్వాత ఖమ్మం జిల్లాలోని మధిర ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లారు. అక్కడ 2018-2023 వరకు పనిచేసి.. గతేడాది తిరిగి కొత్తగూడెం రామవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా వచ్చారు. ఆ తర్వాత నోడల్ అధికారిగా వ్యవహరిస్తూనే తాజాగా ఎంఈఓ బాధ్యతలు చేపట్టడం విశేషం.



విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడుతున్న ప్రభుదయాళ్

సెలవులతో నిమిత్తం లేకుండా అందుబాటులో ఉండటం ప్రభుదయాళ్ ప్రత్యేకత. పనివేళలు లేని రోజుల్లోనూ బడికి వెళ్లడం, ఆవరణ శుభ్రం చేయడం, చెట్లను నాటడం వంటి వ్యాపకాలు కొనసాగిస్తుంటారు. పనిచేసే ప్రతిచోట విద్యార్థులను దత్తత తీసుకుంటారు. పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పించడంతో పాటు ఆరోగ్యపరంగా ఇబ్బందులు వస్తే ఆయనే ప్రథమ చికిత్స అందిస్తారు. అవసరమనుకుంటే ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుంటారు. ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో పక్షుల దాహార్తిని తీర్చేందుకు నీటితొట్లు ఏర్పాటు చేయించారు. వాటిని నిత్యం పిల్లలతో నింపిస్తూ జీవరాశులపై దయ కనబరుస్తున్నారు. అనాథలు, యాచకులకు తనవంతు సాయం చేస్తున్నారు. పేద విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తారు. ఇటీవల రాష్ట్ర ఉపాధ్యాయ ప్రత్యేక అవార్డు స్వీకరణ సందర్భంగానూ.. రాష్ట్ర వరద ముంపు బాధితులకు తనవంతుగా రూ.10 వేల సాయాన్ని ప్రకటించి ప్రభుత్వం నుంచి అభినందనలు అందుకున్నారు. ఇంటిని చక్కదిద్దుకున్నట్లు పనిచేసే బడినీ గుడిలా చూసుకోవాలంటారాయన.



ద్వీపం.. ప్రకృతి అందాల శోభితం

ఆహ్లాద వాతావరణంలో పాల్వంచ కిన్నెరసాని పర్యాటకులను అలరిస్తోంది. చుట్టూ పచ్చందాల హొయలు, వన్యప్రాణుల సందళ్లు, జలాశయంలో బోటు విహారాలు ప్రకృతి ప్రేమికులను కట్టిపడేస్తున్నాయి. దసరా సెలవులు నేపథ్యంలో గత రెండ్రోజులుగా పర్యాటకుల సంఖ్య రెట్టింపైంది. జలాశయం మధ్యనున్న ద్వీపం వంతెన మీదుగా ఇలా అద్భుతంగా కనిపిస్తుండటంతో సందర్శకులు సెల్ఫీలు దిగేందుకు పోటీపడుతున్నారు.

– పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే



సింగరేణిలో బతుకమ్మ సంబరాలు

అమెరికా, జపాన్ పర్యటనను ముగించుకుని శుక్రవారం తిరిగొచ్చిన సింగరేణి సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం సాయంత్రం కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. రాత్రి జరిగిన బతుకమ్మ వేడుకల్లో సీఎండీ, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బతుకమ్మ పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు అధికారులు బహుమతులను అందించారు. పర్యటన విజయవంతంగా ముగించిన సీఎండీని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు, యూనియన్ నాయకులు సన్మానించారు.

– కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే



కనువిందు చేస్తున్న పులిగుండాల

చుట్టూ కొండలు, దట్టమైన అరణ్యాలు మధ్యలో సరస్సు. సహజసిద్ధంగా ఏర్పడిన ‘పులిగుండాల’ ప్రాజెక్టు అందాలు వీక్షకులకు కనువిందు చేస్తున్నాయి. పెనుబల్లి మండలం బ్రహ్మాలకుంట అటవీ ప్రాంతంలోని ఈ ప్రాజెక్టు ప్రకృతి ప్రేమికులను అమితంగా ఆకర్షిస్తోంది. నిత్యం జలంతో కళకళలాడటం దీని ప్రత్యేకత. తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి నిత్యం వందలాది మంది ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. తెలంగాణ ప్రభుత్వం దీనిని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది.

– ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

12న అశ్వారావుపేటలో రైతు సదస్సు

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో ఆయిల్‌పాం రైతులతో ఈనెల 12న సదస్సు నిర్వహించనున్నట్లు టీజీ ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకరరెడ్డి తెలిపారు. అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమ ఆవరణలో రూ.36కోట్లతో నిర్మించిన విద్యుత్తు ప్లాంటు(టర్బైన్)ను అదేరోజు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అశ్వారావుపేట, అప్పారావుపేటలోని పామాయిల్ పరిశ్రమలను ఆయిల్‌ఫెడ్ విస్తరణ, ప్రాజెక్టుల జనరల్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా డీఓ బాలకృష్ణ, అశ్వారావుపేట, అప్పారావుపేట పామాయిల్ పరిశ్రమల మేనేజర్లు కల్యాణ్, నాగబాబుతో కలిసి శుక్రవారం సందర్శించారు. పామాయిల్ పరిశ్రమకు నిరంతరం విద్యుత్తు అందించేందుకు వీలుగా, వచ్చే ఏడాది నూతన పరిశ్రమ నిర్మాణానికి ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నామన్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఏపీ నుంచి అధికసంఖ్యలో రానున్న రైతులతో సదస్సు ఏర్పాటు చేయనున్నామని, జయప్రదం చేయాలని కోరారు. ఈ ఏడాది దసరా కానుకగా రైతులకు అత్యధిక ధర రూ. 17,043 దక్కేందుకు కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సదస్సుకు హాజరుకానున్నారని వివరించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు బండి భాస్కర్ ఉన్నారు.

మన్యంలో వైద్యసేవల మెరుగుకు చర్యలు: పీఓ రాహుల్

చర్ల, న్యూస్‌టుడే: మన్యంలో మెరుగైన వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. చర్లలోని ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం సందర్శించారు. స్థానిక మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడి సౌకర్యాలపై వైద్యాధికారి సాయివర్ధన్‌ను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాష్ట్రంలోని నాలుగు ఐటీడీఏల పరిధిలో అందుతున్న వైద్యసేవలపై సమీక్షించి తగిన సూచనలు చేశారన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఆ మేరకు రానున్న రోజుల్లో మెరుగైన వైద్యసేవలు అందేలా ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. చర్ల, ఇల్లెందు, గార్ల సీహెచ్‌సీలకు కొద్ది రోజుల్లో వైద్యులు, సిబ్బందిని భర్తీ చేస్తామని పీఓ తెలిపారు. గతంలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఖమ్మంలో ఉండటంతో కొన్ని ఇబ్బందులు తలెత్తేవని, వాటిని అధిగమించేందుకు కొత్తగూడెంలో డ్రగ్ స్టోర్ ఏర్పాటు కానుందన్నారు. భద్రాచలంలో సైతం మినీ డ్రగ్ స్టోర్ ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. మారుమూల పీహెచ్‌సీల నుంచి రక్తనమూనాలను కొత్తగూడెం టీహబ్‌కు పంపడంలో ఇబ్బందులు ఎదురవుతుండటంతో కొత్తగా భద్రాచలం ఐటీడీఏకు డయోగ్నోస్టిక్ ల్యాబ్, సీటీస్కాన్ యంత్రం ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు.



చర్ల ఆసుపత్రిలో సేవలపై ఆరా తీస్తున్న పీఓ రాహుల్

విద్యాలయాల్లో పనులు వెంటనే పూర్తి చేయండి

భద్రాచలం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఐటీడీఏ పరిధిలోని విద్యాలయాల్లో నిర్మాణ దశలో ఉన్న పనులను ఈనెల 14లోపు పూర్తిచేయాలని ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశించారు. తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యాలయాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్లోరింగ్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. దసరా సెలవుల తర్వాత వచ్చే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈఈ తానాజీ, డీఈలు పాల్గొన్నారు.

రూ.6.80 కోట్ల గంజాయి దహనం



గంజాయిని దహనం చేస్తున్న ఆబ్కారీ ఉన్నతాధికారులు, సిబ్బంది

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: వివిధ కేసుల్లో పట్టుబడిన రూ.4 కోట్ల గంజాయిని ఖమ్మం జిల్లాలో దహనం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, అశ్వారావుపేట, మణుగూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల గంజాయి రవాణా కేసులు 22 నమోదయ్యాయి. ఆయా ఘటనల్లో ఆబ్కారీ శాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్, రాష్ట్ర, జిల్లా ప్రత్యేక బృందాలు 1065.13 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒక్క పాల్వంచ ఎక్సైజ్ పరిధిలోనే ఏకంగా 1036.43 కిలోల సరకు పట్టుబడింది. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్సుమెంట్ వీబీ కమలాసన్ రెడ్డి ఆదేశాలతో రూ.4 కోట్ల విలువైన గంజాయిని ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాలపేటలోని రాష్ట్ర అధీకృత అడ్వాన్స్‌డ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రంలో శుక్రవారం దహనం చేశారు. ఆబ్కారీ ఎన్‌ఫోర్సుమెంట్ ఖమ్మం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ జి.గణేశ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, అధికారులు పాల్గొన్నారు. ఈ నెల 1 కూడా ఖమ్మం జిల్లాలో ఆబ్కారీ అధికారులు మరో రూ.2.80 కోట్ల విలువైన 1,120 కిలోల గంజాయిని కాల్చి బూడిద చేశారు. ఈ రెండు ఘటనల్లో దహనం చేసిన గంజాయి విలువ సుమారు రూ. 6.80 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు.

‘కథ-2023’ పుస్తకావిష్కరణ 6న

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ‘కథ-2023’ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఖమ్మం జడ్పీ సమావేశ మందిరంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించనున్నారు. ‘ఆంధ్రజ్యోతి’ సంపాదకుడు కె.శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. ప్రముఖ కవి పి.రవిమారుత్ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ఆత్మీయ అతిథులుగా కె.శివారెడ్డి, మువ్వా శ్రీనివాసరావు, కథాసాహితీ సంపాదకులు వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ హాజరవుతారు. పుస్తకాన్ని పి.జ్యోతి సమీక్షించనున్నారు. కవులు, రచయితలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

స్వర్ణ రూపంలో రాములోరి దర్శనం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు కొనసాగించారు. స్వర్ణ కవచాలంకారంలో దేవదేవుడు మెరిసిపోవడంతో వీక్షించిన భక్తులు మురిసిపోయారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడికి అర్చకులు సుప్రభాతం పలికి ఆరాధించారు. క్షేత్రవిశిష్టతను ప్రవచించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. సీతమ్మకు యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీత ధారణ కొనసాగించారు. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక అమితానందాన్ని అందించాయి. దర్బారుసేవ తన్మయత్వాన్ని నింపింది. చిత్తా నక్షత్రం సందర్భంగా యాగశాలలో సుదర్శన హోమం చేశారు. రాములవారిని ప్రభుత్వ కార్యదర్శి సురేంద్రమోహన్ దర్శించుకున్నారు. ఆర్డీఓ దామోదర్‌రావు పాల్గొన్నారు.

ప్రచార మైకులు ప్రారంభం..: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో భక్తి ప్రచార మైకులను ఈఓ రమాదేవి పూజచేసి ప్రారంభించారు. దాతలు రూ.4 లక్షలు అందించగా పట్టణంలోని ప్రధాన వీధుల్లో మైకులను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన వ్యవస్థను ఆలయం వద్ద నెలకొల్పారు. నిత్యం కోవెలలో ఉదయం నుంచి రాత్రివరకు నిర్వహించే పూజలు, హోమాలు, ఉత్సవాల ప్రవచనాలను మైకుల ద్వారా ప్రసారం చేయనున్నారు.



పూజ చేసి మైకు ప్రచారాన్ని ప్రారంభిస్తున్న ఈఓ రమాదేవి



రసాయన వ్యర్థాలు పోసేందుకు వచ్చిన ట్యాంకర్

మున్నేరులో రసాయన వ్యర్థాలను కలిపే యత్నం

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్ పరిధిలోని పలు రసాయన పరిశ్రమల నుంచి సేకరించిన వ్యర్థాలను లారీ ట్యాంకర్‌లో తీసుకొచ్చి మున్నేరులో కలుపుతుండగా స్థానికులు అడ్డుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున గుదిమళ్ల పంచాయతీ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. మున్నేరులో వ్యర్థాలను పోసేందుకు ఓ ట్యాంకర్ రాగా దాన్ని స్థానికులు అనుసరించారు. పశువులు, జీవాలు కలుషిత నీటిని తాగి అనారోగ్యం పాలవుతున్నాయని, చేపలు కూడా చనిపోతున్నాయన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్యాంకర్‌ను ఠాణాకు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేయగా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో ఇలా రసాయన వ్యర్థాలతో వచ్చిన వాహనాన్ని పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే వెంటనే వదిలేశారని, అవే ట్యాంకర్లు మళ్లీ వస్తున్నాయని ఆరోపించారు. కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లాలని పట్టుబట్టారు. చివరకు ట్యాంకర్‌ను ఠాణాకు తరలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌కు చెందిన లారీ డ్రైవర్ కృష్ణ, యజమాని మధుసూదన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు. ఇదే విషయంపై రెండు నెలల క్రితం కూడా కేసు నమోదైనట్లు చెప్పారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ బలవన్మరణం

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని లోతువాగు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకొంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎజ్జు రమేశ్, లక్ష్మి(33) భార్యాభర్తలు. వారికి ఇద్దరు పిల్లలు. దంపతులిద్దరూ కూలి పనులు చేసుకొంటూ కుటుంబాన్ని పోషించుకొంటున్నారు. ఇంటి అవసరాల రీత్యా కొన్నాళ్ల క్రితం మైక్రో ఫైనాన్స్ సంస్థల్లో అప్పులు తీసుకొన్నారు. వాటిని తీర్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మి ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	4,500	7,111	6,500
పాతపత్తి	4,500	7,550	6,000
పెసలు	4,000	7,250	7,025
ఏసీ ఎండుమిరప	10,000	20,000	17,200
ఎండుమిరప	9,000	18,000	17,500
ఏసీ తాలుమిరప	9,000	11,000	10,000
తాలుమిరప	6,000	9,700	9,500

సమస్యల వలయంలో ‘పటేల్’ మైదానం..!

ఖమ్మంలో సర్దార్ పటేల్ మైదానం సమస్యల వలయంలో చిక్కుకుంది. గుంపులు గుంపులుగా శునకాలు సంచరిస్తుండటంతో నడకదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు కూర్చునే స్థలంలో పోల్స్ విరిగిపోయాయి. వాటర్ కూలర్ నిరుపయోగంగా మారింది. మైదానం ఆవరణలో స్తంభానికి కర్ర కట్టి వేలాడదీసిన విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా తయారయ్యాయి. ఓపెన్ జిమ్ పరికరాలు కొన్ని మాత్రమే పనిచేస్తున్నాయి. అక్కడక్కడ పారిశుద్ధ్యం లోపించింది. ఈ అంశాలపై డీఎస్‌డీఓ సునీల్‌రెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. కొన్ని పరికరాలకు మరమ్మతులు చేయిస్తామన్నారు. మైదానంలో సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని చెప్పారు. – ఈనాడు, ఖమ్మం



నడకదారుల మధ్య శునకాల విహారం



క్రీడాకారులు, క్రీడాభిమానులు కూర్చునే స్థలంలో విరిగిన పోల్స్

సత్తుపల్లి

• సత్తుపల్లి • మధిర • వైరా

కళాశాలలో స్వచ్ఛతాహీ సేవా



ఎన్నెస్సీ ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రదర్శన

కల్లూరు, న్యూస్‌టుడే: ఖమ్మానికి చెందిన కేసీఆర్‌నగర్ యూత్ క్లబ్, స్వచ్ఛంద సేవ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు శుక్రవారం కళాశాల, ప్రభుత్వ వైద్యశాల పరిసరాలను శుభ్రం చేశారు. ఎన్నెస్సీ పీవో కె. భానుచందర్, ప్రిన్సిపల్ కతుంబాక శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీవో బి.వీరభద్రం, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎండీని కలిసిన కార్మికులు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: విదేశాలకు వెళ్లి తిరిగి స్వదేశానికి వచ్చిన సింగరేణి సీఎండీ బలరామ్‌నాయక్‌ను ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, జేవీఆర్, కిష్టారం ఓసీ కార్మికులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెంగళ్‌రావు మండలం భవన స్థాపనకు వచ్చిన ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సత్తుపల్లిలో జీఎం షాలెంరాజును కలిసి వినతి పత్రం అందించారు. పీఏ నరసింహారావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) సత్తుపల్లి: 93922 39905, మధిర: 98668 05652, వైరా: 76619 46938

సమస్య: పెద్దగోపతి బీసీ కాలనీలో వీధిదీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. - పాఠకుడు, పెద్దగోపతి

సమాధానం: గాలి దుమారాలతో ఇబ్బంది తలెత్తింది. వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. - సునీత, కార్యదర్శి

- కొణిజర్ల, న్యూస్‌టుడే

కారేపల్లిలోని పలు వీధుల్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో రహదారుల వెంట వెళ్లాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. - స్థానికుడు

✔ తక్షణమే సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం. - ఇన్‌ఛార్జి ఎంపీడీవో రమేశ్

- కారేపల్లి, న్యూస్‌టుడే

కల్లూరు పట్టణ పరిధిలోని మినీ స్టేడియం ఎదుట పది రోజులుగా మిషన్ భగీరథ నీరు లీకై వృథాగా పోతోంది. **స్థానికుడు**

✔ రెండు, మూడు రోజుల్లో మరమ్మతులు నిర్వహిస్తాం. **- రమేష్, ఏఈ**

- కల్లూరు, న్యూస్‌టుడే

పెనుబల్లి, న్యూస్‌టుడే: వీఎం బంజర్‌లోని చర్చి రోడ్డులో మురుగు కాల్వ అధ్వానంగా ఉండటంతో స్థానికులు 'మేమున్నాం... మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్యదర్శి రవిప్రసాద్ స్పందించి శుక్రవారం సిబ్బందితో బాగు చేయించారు.

స్పందనకు వందనం

చింతకాని, న్యూస్‌టుడే: తిరుమలాపురం, తిమ్మినేనిపాలెం సమీపంలో రహదారికి ఇరువైపులా కంప చెట్లు పెరిగి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ 'మేమున్నాం.. మీకు తోడుగా'లో సమస్య ప్రచురితమైంది. ఎంపీడీఓ రామయ్య కార్మికులతో చెట్ల కొమ్మలను, పొదలను నరికించారు.

గోతిని పూడ్చిన అధికారులు




ఈనాడు కథనానికి స్పందన

చింతకాని, న్యూస్‌టుడే: ఖమ్మం- బోనకల్లు మార్గంలోని నాగులవంచ సమీపంలో ఇటీవల కోతకు గురైన రహదారికి ఆర్అండ్‌బీ అధికారులు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. 'ఆదమరిస్తే గోతిలో పడ్డట్లే..:' శీర్షికన ఈ నెల 1న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఏఈ లక్ష్మీనారాయణ మరమ్మతులు చేయించారు.

'భాజపా మతోన్మాదం దేశానికి ప్రమాదకరం'

బోనకల్లు, న్యూస్‌టుడే: భాజపా మతోన్మాదం దేశానికి ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం తూటికుంట్లలో నిర్వహించిన పార్టీ సమావేశంలో మాట్లాడుతూ భాజపా అధికారంలోకి వచ్చాక మతతత్వం పెరిగిపోయిందన్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చింతలచెర్వు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, నాయకులు పాపినేని రాంనర్సయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళలదే ఆధిక్యం..



మూడు నియోజకవర్గాల్లోనూ పురుషుల కంటే ఎక్కువ ఓటర్లు

◆ మధిర ◆ సత్తుపల్లి

చింతకాని, సత్తుపల్లి, న్యూస్‌టుడే

మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని పంచాయతీల్లో తుది ఓటర్ల జాబితాను అధికారులు ఇటీవల ప్రచురించారు. రెండు నియోజకవర్గాలకు సంబంధించి 269 గ్రామ పంచాయతీల్లో మొత్తం 4,09,365 మంది ఓటర్లున్నారు. వారిలో పురుషులు 1,99,250 మంది కాగా మహిళా ఓటర్లు 2,10,115. రెండుచోట్లా పురుష ఓటర్ల కంటే మహిళలే మొత్తంగా 10,865 మంది ఎక్కువ ఉన్నారు. ఈ లెక్కన త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలే మగువలే విజేతలను నిర్ణయించనున్నారన్నమాట.

మధిర		సత్తుపల్లి
131	పంచాయతీలు	138
1,95,940	మొత్తం ఓటర్లు	2,13,425

	మధిర	సత్తుపల్లి
పురుషులు	94,628	1,04,622
స్త్రీలు	1,01,312	1,08,803

★ మధిర నియోజకవర్గం ముదిగొండ మండలంలో అత్యధికంగా 48,117 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 23,091, మహిళా ఓటర్లు 25,026 మంది ఉన్నారు. అత్యల్పంగా మధిర మండలం(మున్సిపాలిటీ మినహా)లో 31,143 మంది ఓటర్లున్నారు.

★ సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని కల్లూరు మండలంలో అత్యధికంగా 53,649 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 26,176 మంది, మహిళలు 27,473 మంది. అత్యల్పంగా సత్తుపల్లి మండలం(మున్సిపాలిటీ మినహా)లో 35,506 మంది ఓటర్లు ఉన్నారు.

★ ఓటర్ల జాబితాను పరిశీలిస్తే గత ఎన్నికలతో పోలిస్తే మధిర మండలంలో ఓటర్ల సంఖ్య పెరిగింది. వేంసూరు మండలంలో తక్కువగా ఉంది. నూతన ఓటర్ల జాబితా ప్రకారం మధిర మండలంలో ప్రస్తుతం 31,145 మంది ఓటర్లు ఉన్నారు. 2019 ఎన్నికల్లో ఇదే మండలంలో 28,597 మంది ఓటర్లు ఉన్నారు. ఈ లెక్కన మధిర మండలంలో 2,548 మంది ఓటర్లు పెరిగారు.

★ వేంసూరు మండలంలో నూతన జాబితా ప్రకారం.. 36,543 మంది ఓటర్లు ఉండగా.. గత ఎన్నికల జాబితా ప్రకారం 41,139 మంది ఉన్నారు. గతంతో పోల్చితే 4,596 మంది తగ్గారు. యువత ఓటు నమోదుకు ఆసక్తి చూపకపోవటంతోపాటు.. అధికారులు సైతం కొత్త ఓటర్ల నమోదుపై పూర్తి స్థాయి దృష్టి సారించకపోవటంతో తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది.

పెరిగిన గ్రామీణ ఓటర్లు

కొణిజర్ల, న్యూస్‌టుడే



గ్రామీణ ఓటర్ల తుది జాబితా ప్రకారం వైరా నియోజకవర్గంలో గతంలో కంటే ఓటర్ల శాతం పెరిగింది. ముఖ్యంగా మహిళా ఓటర్ల శాతం గణనీయంగా అధికమైంది.

12,250 మంది అధికంగా..

నియోజకవర్గంలో అయిదేళ్ల క్రితం 1,56,090 ఓటర్లు ఉండగా ప్రస్తుతం ప్రకటించిన తుది జాబితా ప్రకారం ఆ సంఖ్య 1,68,340. గతం కంటే 12,250 మంది పెరిగారు. అత్యధికంగా కారేపల్లి మండలంలో 4,562 మంది, కొణిజర్లలో 2,309 పెరగ్గా అత్యల్పంగా వైరాలో 716 మంది మాత్రమే పెరిగారు. పెరిగిన లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే మహిళ ఓటర్లు పురుషుల కంటే 4575 మంది అధికంగా ఉన్నారు. అత్యధికంగా ఏన్కూరులో 1135, కొణిజర్లలో 1073, కారేపల్లిలో 936 మంది మహిళ ఓటర్లు అధికంగా నమోదయ్యారు. ప్రతి మండలంలో మహిళ ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో గ్రామీణ తీర్పులో మహిళలే నిర్ణేతలుగా మారనున్నారు.

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం	పెరిగిన ఓటర్లు
కారేపల్లి	21,925	22,861	44,789	4,562
కొణిజర్ల	20,103	21,176	41,279	2,309
ఏన్కూరు	13,319	14,454	27,773	1,784
జూలూరుపాడు	13,521	14,056	27,577	2,879
వైరా	13,013	13,909	26,922	716
మొత్తం	81,881	86,456	1,68,340	12,250

తాగునీటి ఇక్కట్లు తీర్చిన దాత

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన దాత యరమల పూర్ణచంద్రారెడ్డి మూడు గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు తీర్చి ఆదర్శంగా నిలిచారు. భీమవరంలోని బీసీ కాలనీలో రూ. 1.7 లక్షలు, అయ్యవారిగూడెం గ్రామంలో రూ. 1.5 లక్షలతో తాగునీటి పథకాలకు బోర్లు, మోటార్లు ఏర్పాటు చేశారు. భీమవరం హరిజనవాడ శ్మశాన వాటికలో రూ. 20వేలతో చేతిపంపు ఏర్పాటు అగ్రహారంలో రెండు చేతి పంపులకు మరమ్మతులు చేయించారు. వీటిని శుక్రవారం అందుబాటులోకి తెచ్చారు. మరో పక్క భీమవరం పంచాయతీ కార్యాలయం ఎదుట రూ. 1.5 లక్షలతో వర్షపు నీరు, మురుగునీరు వెళ్లేలా పైపులైన్ ఏర్పాటు చేయించారు. పూర్ణచంద్రారెడ్డికి మూడు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ప్రజాప్రతినిధులు ఎస్. శ్రీనివాసరెడ్డి, ఏవీ. కృష్ణారావు, వై. శ్రీనివాసరెడ్డి, జి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



భీమవరంలో ఏర్పాటు చేసిన బోరు వద్ద దాత పూర్ణచంద్రారెడ్డి (టీషర్టు ధరించిన వ్యక్తి)

తాగునీటి సహాయకులకు శిక్షణ

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక మిషన్ భగీరథ కార్యాలయంలో శుక్రవారం పెనుబల్లి మండలానికి చెందిన తాగునీటి సహాయకుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈఈ కె. జయలక్ష్మి మాట్లాడుతూ పైపులైన్ లీకేజీలు, చేతిపంపుల మరమ్మతుల విషయంలో పూరి స్థాయిలో శిక్షణ తీసుకోవాలన్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

షాదీఖాన పనులు త్వరగా పూర్తి చేయండి: కలెక్టర్

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరులో రూ. 75 లక్షలతో గతేడాది మంజూరైన షాదీఖాన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం కల్లూరు షాదీఖానా భవన నిర్మాణం పరిశీలించారు. పనుల్లో జాప్యానికి కారణాలను పీఆర్ ఈఈ రామకోటినాయుడు, డీఈఈ రావిరాల రాంబాబులను అడిగి తెలుసుకున్నారు. మసీదు కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఎమ్మెల్యే రాగమయి, ఆర్డీవో రాజేందర్‌గౌడ్, తహసీల్దారు పులి సాంబశివుడు, కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, ఏఎంసీ ఛైర్‌పర్సన్ నీరజాదేవి, ముస్లిం మైనారిటీ నాయకులు మండల సదర్, సయ్యద్ ఆలీ, మసీదు సదర్ ఎస్కే హనీఫ్, కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్రావు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



మసీదు కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక వేంసూరు రోడ్డులోని నీలాద్రి అర్బన్‌పార్కు సమీపంలోని ఖబరస్తాన్‌ను ఎమ్మెల్యే మట్టా రాగమయి శుక్రవారం సందర్శించారు. కొన్ని రోజులుగా సదరు భూమిపై అటవీ అధికారులతో వివాదం నేపథ్యంలో ఎమ్మెల్యేకు ముస్లింలు వినతి పత్రాన్ని అందజేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



నాగప్రణీత్

ముదిగొండ, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ముదిగొండకు చెందిన ఉప్పు నాగప్రణీత్(23) డిగ్రీ పూర్తి చేసి రెండేళ్లుగా పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్నాడు. ఉద్యోగం సాధించలేకపోయాననే మనోవేదనతో గత నెల 28న ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకోగా గమనించిన బంధువులు అతణ్ని చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు శుక్రవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి భాస్కర్‌రావు ఫిర్యాదు మేరకు ముదిగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిన ప్రమాదం

మధిర గ్రామీణం, న్యూస్‌టుడే: దెందుకూరు గ్రామంలో సుబాబుల్ లోడ్‌తో వెళ్తున్న ఓ ట్రాక్టర్ శుక్రవారం బోల్తాపడింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. పొలాల్లో నుంచి గ్రామంలోకి వస్తున్న సుబాబుల్ లోడ్ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఆ సమయంలో కర్రలు రహదారిపై నుంచి సమీప దుకాణంలోకి వెళ్లాయి. అక్కడ ఎవరూ లేకపోవటంతో ప్రమాదం తప్పింది.



దాడి ఘటనపై కేసు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: బనిగండ్లపాడు గ్రామానికి చెందిన అన్నెం రాంబాబు, తుపాకుల శంకర్‌రావు మధ్య కొంతకాలంగా భూవివాదాలున్నాయి. తన పత్తి పంటను శుక్రవారం రాంబాబు నరికివేస్తుండగా శంకర్‌రావు అడ్డుకున్నాడు. దీంతో శంకర్‌రావు తలపై రాంబాబు కొట్టడంతో గాయమైంది. ఇద్దరూ వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై కె. వెంకటేష్ వివరించారు.

పోలీసులకు ఫిర్యాదు

కొణిజర్ల, న్యూస్‌టుడే: తనికెళ్లలో రామకృష్ణ, ఉదయలక్ష్మిలు స్వీటు షాప్‌తోపాటు కొబ్బరిబొండాల వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఎదురుగా ఓ మహిళ పూలబండిని ఏర్పాటు చేసుకుంది. పూలబండిని పక్కన ఏర్పాటు చేసుకోవాలని రామకృష్ణ సూచించాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అదే గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి జోక్యం చేసుకుని కొబ్బరి బొండాల కత్తితో రామకృష్ణ, ఉదయలక్ష్మిలపై దాడికి యత్నించాడు. ఉదయలక్ష్మికి గాయమైంది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హామీలను అమలు చేయాలి: కేవీపీఎస్

మధిర, న్యూస్‌టుడే: గత ఎన్నికల్లో దళితులకు ఇచ్చిన హామీలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సీ కాలనీలో శుక్రవారం నిర్వహించిన కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆవిర్భావ దినోత్సవంలో ప్రభాకర్ మాట్లాడారు. డివిజన్ కార్యదర్శి కిరణ్, వ్యకాసం జిల్లా నాయకులు తెలప్రోలు రాధాకృష్ణ, పి. విల్సన్. ఎం. నాని, వై. నాగేశ్వరరావు, ఓ. ఏసు తదితరులు పాల్గొన్నారు.

'చివరి ఆయకట్టుకు నీరందించాలి'

తల్లాడ, న్యూస్‌టుడే: మండలంలోని చివరి ఆయకట్టు భూములకు సాగర్ జలాలు అందడం లేదని తెలంగాణ రైతుసంఘం నాయకులు, రైతులు శుక్రవారం ఎన్నెస్పీ ఈఈ ఎం. లక్ష్మీనారాయణకు విన్నవించారు. స్పందించిన ఈఈ స్థానిక అధికారులను కాల్వ వద్దకు వెళ్లాలని ఆదేశించారు. కార్యక్రమంలో శీలం సత్యనారాయణరెడ్డి, అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, కల్యాణపు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమం విస్మరిస్తే వెనకబాటు'

పెనుబల్లి, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరిస్తే రాష్ట్రం వెనకబాటుకు గురవుతుందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు అన్నారు. ఉప్పలచెలకలో శుక్రవారం సీపీఎం గ్రామ శాఖ మహాసభకు మామిళ్ల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, కండే సత్యం, చిరంజీవి పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థినికి చేయూత

వైరా, న్యూస్‌టుడే: నిరుపేద ఇంజినీరింగ్ విద్యార్థిని రజితకు మోక్షిత నిధి ఫౌండేషన్ చేయూత అందించారు. విద్యావసరాల నిమిత్తం రూ. 15 వేల సెల్‌ఫోన్‌ను శుక్రవారం సంస్థ బాధ్యుడు ఆర్. ఉప్పలచారి అందించారు.

కార్యదర్శుల నూతన కార్యవర్గం

కారేపల్లి, న్యూస్‌టుడే: మండల పంచాయతీ కార్యదర్శుల సమావేశం కారేపల్లిలో శుక్రవారం నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడిగా నెహ్రూ, మద్దెల వెంకటేశ్, కార్యదర్శిగా హరి, కోశాధికారిగా కొత్తపల్లి అనుషాతోపాటు పలువురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

తెదేపా నాయకుడి మృతి

కొణిజర్ల, న్యూస్‌టుడే: పెద్దమునగాలకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు చింతల మల్లయ్య(70) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందాడు. మృతదేహానికి తెదేపా మండలాధ్యక్షుడు తాతా సుధాకర్, మాజీ సర్పంచి పరికపల్లి శ్రీను, నాయకులు నివాళి అర్పించారు.

సర్వే పరిశీలన

వైరా, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ 14వ వార్డులో జరుగుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను శుక్రవారం డీఎల్‌పీవో రాంబాబు, తహసీల్దార్ శ్రీనివాస్, కమిషనర్ చింతా వేణు పరిశీలించారు. తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని సూచించారు.

తల్లాడ కూడలిలో మళ్లీ వెలుగులు



తల్లాడ, న్యూస్‌టుడే: ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కూడలిగా ఉన్న తల్లాడ మండల కేంద్రంలోని రింగు రోడ్డులో గతంలో వీధి దీపాలు వెలుగులు విరజిమ్మేవి. కొంతకాలంగా కూడలిలో ఎత్తు తక్కువలో ఉన్న స్తంభానికి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో సరైన వెలుగులు లేవు. ఈ నేపథ్యంలో భారీ క్రేన్ సాయంతో హైమాస్ట్ స్తంభానికి తిరిగి అధికారులు వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యాలను 'న్యూస్‌టుడే' శుక్రవారం క్లిక్‌మనిపించింది.

వన్యప్రాణి వారోత్సవాలు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లిలో వన్యప్రాణి వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. సత్తుపల్లి నుంచి రేగళ్లపాడు వరకు రేంజర్ స్నేహలత ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. డీఆర్‌ఓ పిచ్చేశ్వరరావు, ఎఫ్ఎస్‌ఓలు నరసింహా, అరుణ్, వేణు, నాగరాజు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ శ్రేణుల ప్రదర్శన

చింతకాని: నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పీడీఎస్‌యూ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. జిల్లా కమిటీ బాధ్యుడు మస్తాన్, నాయకులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



సత్తుపల్లిలో..





ఎర్రుపాలెం: కవచాలంకారంలో పద్మావతీ, అలివేలు మంగ

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం యాగశాలలో పూజలు, గణపతి హోమం నిర్వహించారు. దుర్గాదేవి అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి రూపంలో దర్శనమిచ్చారు. ఎర్రుపాలేనికి చెందిన చీదెళ్ల వెంకటరామన్ దంపతులు అమ్మవారికి ముత్యాల కవచం తయారు చేయించి అందించారు. ఆలయ ధర్మకర్త శ్రీరామచంద్రమూర్తి, పర్యవేక్షకురాలు కె. విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, మురళీమోహనశర్మ, రాజీవ్‌శర్మ పాల్గొన్నారు.

సత్తుపల్లి, న్యూస్‌టుడే: జవహర్‌నగర్ శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలోని అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనం ఇచ్చారు. బుగ్గపాడు కనకదుర్గమ్మతల్లిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు.

తల్లాడ: తల్లాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బెల్లం కొండ ఆంజనేయులు ఆధ్వర్యంలో తల్లాడలో మహిళలకు 400 కోలాటం కర్రలను పంపిణీ చేశారు.

పెనుబల్లి: వీఎం బంజర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో గాయత్రిదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఎన్ఎస్పీ కాల్వఒడ్డున శ్రీదుర్గామల్లికార్జునస్వామి ఆలయం, శ్రీరాజసాయి మందిరం, శ్రీకోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మధిర, న్యూస్‌టుడే: అయ్యప్పనగర్, ఆజాద్ రోడ్డు, దేశభక్త యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవీమాతకు పూజలు నిర్వహించారు. మహిళలు బతుకమ్మ ఆడారు.

ఏన్కూరు, న్యూస్‌టుడే: మండపాల వద్ద అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు. టీఎల్‌పేటలో ఊరంతా ఒకేచోట బతుకమ్మ సంబురాలు చేయడంతో జాతరను తలపిస్తుంది. ఏన్కూరులో కోదండ రామాలయం, చెరువుబజార్, ఆర్యవైశ్య కల్యాణ మండపం కూడళ్లలో బతుకమ్మ ఆటలాడుతున్నారు.



లడక్‌వీధిలో బతుకమ్మలాడుతున్న మహిళలు



చింతకాని: నాగులవంచలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు

ఏకగ్రీవంగా టీఎన్జీవోస్ కార్యవర్గం





చింతకాయల కృష్ణ చీకటి చైతన్య

సత్తుపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర సంఘం ఆదేశాల మేరకు సత్తుపల్లిలో టీఎన్‌జీఓస్ యూనిట్ ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. సింగిల్ సెట్ నామినేషన్లు రావడంతో కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైందని ఎన్నికల అధికారి పి. లక్ష్మినారాయణ తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులుగా చింతకాయల కృష్ణ, చీకటి చైతన్యలతోపాటు కోశాధికారిగా పగిడిపల్లి అయోధ్యలు ఎన్నికయ్యారు. మరో 12మంది సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కె. శ్రీనివాస్, రామయ్య, జయపాల్, దుర్గాప్రసాద్, లలితకుమారి, శ్రీనివాస్, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.



పెద్దపుల్లయ్య, విజయ్‌కుమార్

తల్లాడ, న్యూస్‌టుడే: టీఎన్‌జీవోస్ కల్లూరు యూనిట్ ఎన్నికలకు జి. భాస్కర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సింగిల్ సెట్ నామినేషన్లు రావడంతో కార్యవర్గం మొత్తం ఏకగ్రీవమైంది. కల్లూరు యూనిట్ అధ్యక్షునిగా కొత్త పెద్దపుల్లయ్య, కార్యదర్శిగా జి. విజయ్‌కుమార్, కోశాధికారిగా వి. వెంకటరమణతోపాటు మరో 12మంది సభ్యులు ఎన్నికయ్యారు. జిల్లా కోకన్వీనర్ కొణిదెన శ్రీనివాస్, టీఎన్‌జీవోస్ జిల్లా మాజీ అధ్యక్షుడు రామయ్య, జయపాల్, దుర్గాప్రసాద్, లలితకుమారి పాల్గొన్నారు.

వైరా, న్యూస్‌టుడే: వైరా యూనిట్ ఎన్నికలకు గుర్రం ధనలక్ష్మి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సింగిల్ సెట్ నామినేషన్లు రావడంతో కార్యవర్గం ఏకగ్రీవమైంది. అధ్యక్షుడిగా తన్నీరు ప్రవీణ్, కార్యదర్శిగా దొండ అనంతరాములు, కోశాధికారిగా గుగులోతు వాల్యాతోపాటు మరో 12 మంది సభ్యులు ఎన్నికయ్యారు.



కార్యవర్గాన్ని సన్మానించిన టీఎన్‌జీఓస్ నాయకులు

ప్రతిభకు పట్టం

డీఎస్సీ ఫలితాల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులు 1:3 ఎంపికలో సత్తా చాటారు. పట్టుదలతో పరీక్షలకు సన్నద్ధమయ్యారు. - వైరా, న్యూస్‌టుడే

రెండో ఉద్యోగం వైపు..



రెబ్బవరం గ్రామానికి చెందిన **తిరుమలదాసు గోపాలరావు** ఉపాధ్యాయ పోస్టుకు అర్హత పొందారు. ప్రస్తుతం ఇతడు మధిర జ్యోతిబా పులే గురుకుల పాఠశాలలో టీజీటీగా పని చేస్తున్నారు. రెండు నెలల క్రితమే గురుకుల పోస్టుకు ఎంపికై విధుల్లో చేరారు. ఇంతలో డీఎస్సీలో స్కూల్ అసిస్టెంటు గణితంలో జిల్లా స్థాయి మూడో ర్యాంకు సాధించారు. నేపథ్యం వ్యవసాయాధారిత కుటుంబం.

అందరి ప్రోత్సాహంతో...



రెబ్బవరం గ్రామానికి చెందిన **సాదం దివ్య** ఎస్జీటీ విభాగంలో జనరల్ కోటాలో 30వ ర్యాంకు సాధించారు. భర్త ఉపేందర్‌రావు కానిస్టేబుల్. నెలల బిడ్డ ఉన్నప్పటికీ కష్టపడి చదివారు. భర్త, తల్లిదండ్రులు ప్రోత్సహించారు.

పలుసార్లు ప్రయత్నించి...



గొల్లపూడికి చెందిన **గోరింట్ల వెంకటేశ్వర్లు** వ్యాయామ ఉపాధ్యాయ విభాగంలో జిల్లా స్థాయిలో మూడో స్థానంలో నిలిచారు. పీజీతోపాటు ఇతర ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం కోసం పలుసార్లు ప్రయత్నించారు. చివరకు 40 ఏళ్ల ప్రాయంలో పట్టుదలతో ఉద్యోగం సాధించారు. ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పని చేస్తూ కుటుంబ భారాన్ని మోస్తున్నారు.

ప్రభుత్వ కొలువు సాధించాలని..



వైరాలోని లీలాసుందరయ్యనగర్‌కు చెందిన **సజ్జనపు విజయ** ఎస్జీటీలో 28వ ర్యాంకు సాధించారు. పీజీ అనంతరం ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివారు. తొలి ప్రయత్నంలోనే 1:3కి ఎంపికయ్యారు. తల్లిదండ్రులు పర్వతాచారి, కృష్ణకుమారి ప్రోత్సహించారు.

ఎస్జీటీ విభాగంలో..



వైరాలోని లీలాసుందరయ్యనగర్‌కు చెందిన **సజ్జనపు వసంత వాణి** ఎస్జీటీ విభాగంలో 116వ ర్యాంకు సాధించారు. తండ్రి సత్యనారాయణ ఆర్టీసీ డ్రైవర్. తల్లి యూన్సీ ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. తన కాళ్లపై నిలబడాలనే అమ్మ ఆకాంక్షను నెరవేర్చారు. విజయ, వసంతవాణి అన్నదమ్ముళ్ల పిల్లలు. ఇద్దరు వరుసకు అక్కాచెల్లెళ్లు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

కొణిజర్ల, న్యూస్‌టుడే: హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో దుద్దెపూడికి చెందిన ఓ విద్యార్థినికి ఆర్థికసాయం శుక్రవారం అందించారు. పానెం శ్రీహర్షిత ఎంబీబీఎస్‌లో సీటు సాధించి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న సంస్థ ఖమ్మం సభ్యురాలు సైదారాణి రూ. 10 వేల అందించారు. పీఆర్‌టీయూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు చేతుల మీదుగా నగదు అందజేశారు.

ప్రజా సమస్యలపై సీపీఐ ధర్నా

వేంసూరు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు పేదలకు రూ. 12వేలు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ జిల్లా నాయకుడు, బీకేఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నాలో మాట్లాడుతూ ఉపాధి కూలీల వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. తహసీల్దారు ఎంఏ రాజుకు వినతి పత్రం అందజేశారు. మహిళా సమాఖ్య నాయకురాలు రంజాన్‌బీ, సీపీఐ నాయకులు హమీద్, లాల్‌అహ్మద్ పాల్గొన్నారు.

ఖమ్మం
• ఖమ్మం • పాలేరు

ప్రతి కుటుంబ వివరాలు సేకరించాలి


గ్రామస్థులతో మాట్లాడుతున్న సురేంద్రమోహన్

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబ వివరాలను పక్కాగా సేకరించాలని రాష్ట్ర గనులశాఖ కార్యదర్శి, ఖమ్మం జిల్లా ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ తెలిపారు. శుక్రవారం రఘునాథపాలెం మండలం రాములు తండాలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే కార్యక్రమాన్ని కలెక్టర్ మధుసూదన్ నాయక్‌తో కలిసి ఆయన పరిశీలించారు. సర్వేపై అధికారులు, గ్రామస్థులతో మాట్లాడారు. డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, మైనింగ్ ఏడీ సాయినాథ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రూ.4 లక్షల ఎల్‌వోసీ అందజేత

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: తన సిఫార్సు మేరకు సీఎంఆర్ఎఫ్ నుంచి అందించిన రూ.4 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌వోసీ)లను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర వ్యక్తిగత సిబ్బంది శుక్రవారం బాధితులకు అందించారు. ములకలపల్లి మండలం వేపలగడ్డకు చెందిన వై.వెంకటేశ్వర్లు, కొణిజర్ల మండలం పెద్దగోపతి గ్రామానికి చెందిన బి.హరికి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చొప్పున ఎల్‌వోసీలను అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 93944 50199
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081

సమస్య: కవిరాజనగర్ 9వ వీధి చివరలో విద్యుత్ దీపం గత నెల రోజులుగా వెలగడం లేదు. - విజయ

సమాధానం: పరిశీలించి ఏర్పాటు చేస్తాం. - కృష్ణలాల్, ఈఈ

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

వరద బాధితులకు సాయం అందించాలి


నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మంలో మున్నేరు వరద ప్రభావానికి గురై నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.16,500 నగదును తక్షణమే బ్యాంకు ఖాతాలో జమ చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సీపీఎం మూడో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మూడో పట్టణ కార్యదర్శి భూక్యా శ్రీనివాసరావు, కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావు, నాయకులు శ్రీనివాసరావు, సత్యనారాయణ, వీరబాబు, నర్సింహారావు, పుల్లయ్య, రాజు, అమీనా, వీరయ్య పాల్గొన్నారు.

క్రీడల కాలం ఎండల ప్రతాపం


ఎండ ప్రతాపంతో క్రీడాకారుల తిప్పలు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: పగలంతా ప్రచండ ఎండ, సాయంత్రం మబ్బులు, పలుచోట్ల భారీ వర్షం ఇలాంటి వింత వాతావరణం, క్రీడాకారులకు అగ్ని పరీక్షగా మారింది. పాఠశాల స్థాయి నుంచి కళాశాలలు, అసోసియేషన్ క్రీడలు ఇప్పుడే ఊపందుకున్నాయి. ముఖ్యం అథ్లెటిక్స్ సమాఖ్య క్యాలెండర్ ప్రకారం వివిధ రకాల విభాగాల పోటీలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి బయలు దేరే క్రీడాకారులు ఉదయం 11 గంటల వరకు మైదానాలకు చేరుతున్నారు. వేడి వాతావరణం, అధిక ఉష్ణోగ్రతల మధ్య పాల్గొనేందుకు క్రీడాకారులు, నిర్వహించేందుకు నిర్వాహకులు ఆపసోపాలు పడుతున్న తీరు ఉంది. శుక్రవారం ఖమ్మం పటేల్ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీలకు హాజరైన క్రీడాకారులు ఎండ వేడి తాళలేక కొందరు చెట్ల నీడకు చేరగా మరికొందరు గుడ్డలు నెత్తిన కప్పుకొని తిరిగారు.

ఆర్మీ క్యాంటీన్ ఇప్పట్లో హుళక్కే


తుది మెరుగులుగా సైనిక సంక్షేమ భవనం

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: నగరంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయం నూతన భవనం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ముందుగా ప్రతిపాదించిన ప్రకారం భవనంలో సైనిక ఆసుపత్రి, కార్యాలయం, క్యాంటీన్, సమావేశ మందిరానికి తగిన విధంగా నిర్మాణ పనులు జరిగాయి. మిగతా అంశాలు ఎలా ఉన్నా ఆర్మీ క్యాంటీన్ ఇప్పట్లో ఖమ్మం నగరానికి వచ్చే సూచనలులేవని నిబంధనలు చెబుతున్నాయి. క్యాంటీన్ ఏర్పాటు చేయాలంటే సైనికులు, మాజీ సైనికులు కనీసం 2,500 మంది ఈ ప్రాంతంలో నమోదై ఉండాలి. ఒక్కో సైనికుడి కుటుంబం నుంచి మొత్తం నలుగురు కుటుంబ సభ్యులకు క్యాంటీన్‌లో అనుమతి ఉంటుంది. జిల్లా లెక్కిస్తే క్యాంటీన్ రావాలంటే 10 వేల మంది వినియోగదారులు ఉండాలి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తంగా లెక్కేసినా ఇప్పుడున్న వారి సంఖ్య 1,500 దాటడం లేదు. అంటే మరో కొద్ది ఎక్కువ తక్కువతో మరో వెయ్యి మంది వినియోగదారులు పెరగాలి. దీంతో ఆర్మీ క్యాంటీన్ ఇప్పట్లో రాదనే చర్చ సాగుతోంది. సైనిక సంక్షేమాధికారి చంద్రశేఖర్ వద్ద ఈ విషయాన్ని ‘న్యూస్‌టుడే’ ప్రస్తావించగా నిర్దిష్ట సంఖ్య ఉన్న ప్రాంతాల్లోనే క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నారని, మన దగ్గర సంఖ్య పెరగాల్సి ఉందన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎస్పీనగర్‌లో నివాసముంటున్న బాగం వాణి(55)కి మతిస్థిమితం సరిగ్గా లేదు. ఈనెల 2న గడ్డిమందు తాగి బలవన్మరణానికి యత్నించారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం చనిపోయారు. ఆమె కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరిపై కేసు నమోదు

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: శంకరగిరితండాలో వ్యక్తిగత కారణాలతో [illegible] బాధితుడి ఫిర్యాదు మేరకు హుస్సేన్, నాగరాజుపై కేసు నమోదు చేశామని ఎస్సై సంతోష్ శుక్రవారం తెలిపారు.

మహిళల మెడల్లోని గొలుసుల చోరీ

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: నగరంలో శుక్రవారం రాత్రి రెండు గొలుసు చోరీలు చోటు చేసుకున్నాయి. మామిళ్లగూడెంలో ఓ మహిళ బస్టాప్‌లో దిగి తన ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లాడు. మరో ఘటనలో ఏపీలోని రాజమండ్రికి చెందిన ఓ మహిళ ఖమ్మంలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వస్తూ.. జమ్మిబండ పార్కు సమీపంలో కారు దిగి రోడ్డు దాటేందుకు వెళ్తుండగా ఆమె మెడలోని బంగారు గొలుసును ఓ వ్యక్తి లాక్కొని పరారయ్యాడు. రెండో పట్టణ పోలీసులకు ఘటనా స్థలాలను పరిశీలించి సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యకారులకు నైపుణ్య శిక్షణ


మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డా.శ్యాంప్రసాద్

కూసుమంచి, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ జిల్లా మత్స్యకారులకు పాలేరులోని మత్స్య పరిశోధన కేంద్రంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో చేపల పెంపకానికి వనరులు పుష్కలంగా ఉన్న నేపథ్యంలో చేపల ఉత్పత్తిని రెట్టింపు చేయాల్సిన అవసరం ఉందన్నారు. చేపల మేత తయారీ విధానంపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త రవీందర్ పాల్గొన్నారు.

ఇంటింటికీ ఆరు మొక్కలు: మేయర్


సుగ్గలవారితోటలో మొక్కలు పంపిణీ చేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేయనున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. శుక్రవారం నగరంలోని సుగ్గలవారితోటలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిబ్బంది శేఖర్, రాజు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

★ నగరంలోని 12వ డివిజన్‌లో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ కాల్వ నిర్మాణానికి మేయర్ పునుకొల్లు నీరజ శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ చిరుమామిళ్ల లక్ష్మి, డీఈఈ ధరణికుమార్, నాయకులు సతీష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘పేదలకు ఆమడ దూరంలో వైద్యం’


శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నంద్యాల నరసింహారెడ్డి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: పేదలకు విద్య, వైద్యం ఆమడ దూరంలో ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి అన్నారు. నేలకొండపల్లి సీపీఎం కార్యాలయంలో పైనంపల్లికి చెందిన మందడపు గోపయ్య-అనసూర్యమ్మ, నాగుబండి సత్యనారాయణ-రాములమ్మ జ్ఞాపకార్థం నిర్మించిన సమావేశ మందిరాన్ని, ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మహిళా కుట్టు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. నిరుద్యోగం దేశాన్ని పట్టిపీడుస్తున్న తరుణంలో మహిళలు స్వయం ఉపాధి పొందాలని సూచించారు.

రక్షణ కంచె తొలగింపు



కామేపల్లి, న్యూస్‌టుడే: ముచ్చర్ల రామస్వామి గుట్టపై మొక్కలను సంరక్షించాలనే ఉద్దేశంతో మూడేళ్ల క్రితం అటవీ శాఖ అధికారులు రూ.లక్షలు ఖర్చు చేసి ఫెన్సింగ్‌తో కంచెను ఏర్పాటుచేశారు. గుట్టపై పెద్ద సంఖ్యలో మొక్కలు సైతం నాటారు. మూడేళ్లపాటు అటవీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సంరక్షించారు. ఆరు నెలలుగా నిర్వహణ కొరవడటంతో కొందరు వేటగాళ్లు, పశువులు, జీవాల పెంపకదారులు ఫెన్సింగ్ కంచెకు అనేకచోట్ల రంధ్రాలు చేసి గుట్టపై సంచరిస్తున్నారు. కొందరు వేటగాళ్లు ప్రమాదకరంగా విద్యుత్తు తీగల సాయంతో అటవీ జంతువులను వేటాడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ★ ‘కంచెను కొందరు స్థానికులు తొలగిస్తున్నారు. కొన్ని చోట్ల రంధ్రాలను పూడ్చివేశాం. పలుమార్లు హెచ్చరించినా మార్పులేదు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. – నాగరాజు, ఎఫ్‌బీవో, ముచ్చర్ల

వంతెన నిర్మిస్తే.. ఎంతో మేలు



పాలేరు - మరిపెడ బంగ్లా మార్గంలో ప్రధాన రహదారిపై ఓ చోట వంతెన లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడు వద్ద ఈ రహదారిని ఆనుకుని ఉండే పెద్ద చెరువు అలుగు పోస్తే రోడ్డుపై నుంచి ప్రవహిస్తాయి. అలుగు ప్రవాహం పెరిగితే రాకపోకలు నిలిచిపోతాయి. ఇటీవల వచ్చిన వరదలకు బచ్చోడు పెద్ద చెరువు వారంపాటు అలుగు పోయటంతో రహదారి గుంతలమయమై రాళ్లు తేలాయి. ఎలాంటి సూచికలు లేకపోవడంతో వాహనదారులు కొన్నిసార్లు లోతు తెలియక వెళ్తూ ప్రమాదాల బారినపడుతున్నారు. పాలేరు నియోజకవర్గంలో పలు గ్రామాల ప్రజలు బంగ్లాకు ఎక్కువగా ఈ దారిలో ప్రయాణిస్తుంటారు. అలుగు పారితే 20 కి.మీ. చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తోంది. బచ్చోడు వద్ద వంతెన నిర్మిస్తే ఇబ్బందులు తొలగుతాయని ప్రజలు కోరుతున్నారు. – తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే

వ్యర్థాలకు నిప్పు.. పచ్చని చెట్టుకు ముప్పు



పాలేరు జలాశయంలో ఇటీవల వరదలకు చెత్త, ప్లాస్టిక్ సీసాలు, ఇతర వ్యర్థాలు పెద్ద ఎత్తున కొట్టుకువచ్చాయి. జలాశయం నీటి మట్టం తగ్గడంతో అవన్నీ కట్ట వారగా ఆగిపోయాయి. రెండు రోజుల కిందట ఎవరో వ్యక్తి వ్యర్థాలకు నిప్పు పెట్టారు. ఆ మంటలు పక్కనే ఉన్న పచ్చని చెట్టు అంటుకోవటంతో వృక్షం కాలిపోయింది. – కూసుమంచి, న్యూస్‌టుడే

నేడు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేడు జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఖమ్మం నగరంలో జీవీ మాల్ ప్రారంభోత్సవానికి హాజరవుతారు. అనంతరం రాపర్తినగర్, రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

ఐదు లేఅవుట్ల ఆమోదం

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లా లేఅవుట్ కమిటీ సమావేశంలో ఐదు లేఅవుట్లకు అనుమతించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీజ, కమిషనర్ అభిషేక్, ఇతర శాఖల అధికారుల లేఅవుట్ దరఖాస్తులను పరిశీలించారు.

డీఎస్సీలో బీసీ స్టడీ సర్కిల్ అభ్యర్థుల ప్రతిభ

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఖమ్మం బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ తీసుకున్న అభ్యర్థులు ఉత్తమ ప్రతిభ చూపారని డైరెక్టర్ శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తీసుకున్న 259 మంది అభ్యర్థుల్లో 62 మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. వారిలో ఫస్ట్ ర్యాంక్ సాధించిన బొడ్డుపల్లి పెద్దిరాజు(ఎస్ఏ), నాలుగో ర్యాంకు మేకల సందీప్(ఎస్ఏ), ఐదో ర్యాంకు నాగభూషణం(ఎస్ఏ), ఆరో ర్యాంకు పాలెపు నాగేశ్వరరావు(ఎస్ఏ), ఐదో ర్యాంక్ మీసాల యామిని(ఎస్జీటీ) తదితరులు ఉన్నారన్నారు. వారికి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, బీసీ సంక్షేమాభివృద్ధి అధికారిని జి.జ్యోతి అభినందనలు తెలిపారని పేర్కొన్నారు.

సీజీఆర్ఎఫ్ సభ్యునిగా రామారావు

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: టీఎస్ఎన్‌పీడీసీఎల్ కన్జ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం(సీజీఆర్ఎఫ్)-1లో సభ్యునిగా భారతీయ కిసాన్ సంఘ్ జోన్ ప్రధానకార్యదర్శి మందనపు రామారావు నియమితులయ్యారు. శుక్రవారం ఉత్తర్వులు అందినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

నిరుపేద మెడిసిన్ విద్యార్థినికి ఆర్థికసాయం

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎంబీబీఎస్‌లో ప్రవేశం పొందిన నిరుపేద విద్యార్థిని పానం శ్రీహర్షితకు హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యురాలు శుక్రవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు.

‘స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి’

కామేపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని మండల ప్రత్యేకాధికారి మధుసూదన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంపు ఆపరేటర్లకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. డీఈ మురళీకృష్ణ, ఏఈలు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: కరుణగిరి ప్రాంతంలోని వరద బాధితులకు హైదరాబాద్‌కు చెందిన సంకల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంట సామగ్రి, దుప్పట్లను శుక్రవారం పంపిణీ చేశారు.

నేలకొండపల్లి: సుర్దేపల్లిలో వరద బాధితులకు నవతా ట్రాన్స్‌పోర్ట్ ఆధ్వర్యంలో నిత్యావసరాలను అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు, ట్రాన్స్‌పోర్ట్ డిప్యూటీ మేనేజర్ ఆర్.శ్రీనివాసరావు, నేలకొండపల్లి ఏజెంట్ గుండా బ్రహ్మం, కడియాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: హ్యాండ్‌బాల్ జిల్లా బాలబాలికల జట్లను శుక్రవారం ఖమ్మం పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. బాలుర జట్టులో గౌతమ్, జగదీష్, వెంకటేశ్, రామాంజనేయులు, గణేష్, నగేష్, కరుణాకర్, అజయ్, తిరుపతి, భద్రు, రవికిరణ్, సాయితేజ, ఉపేంద్ర, నివాస్, రవికుమార్, రామారావు, శ్రీకాంత్ ఉన్నారు. బాలికల జట్టులో నందిని, ఉషశ్రీనేహా, ఎస్.నందిని, సమైక్య, మీనాక్షి, త్రిపుర, అశ్విని, కీర్తి, సాయిప్రసన్న, సింధు, సౌమ్య, వి.సంధ్య, కె.సంధ్య, నాగేంద్రకుమారి, శ్రీలత, కృష్ణశ్రీ, అర్చన ఉన్నారు.

ముగిసిన పోటీలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాయకరావుపేట శ్రీప్రకాశ్ విద్యానికేతన్‌లో తెలుగు రాష్ట్రాల సీబీఎస్ఈ క్లస్టర్-7 వాలీబాల్, కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. కబడ్డీ అండర్-19 విభాగంలో ఖమ్మం హార్వెస్ట్ పబ్లిక్ స్కూలు జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. విజేతలకు హోంశాఖ మంత్రి అనిత బహుమతులు అందించారు.

టీవీఎస్ జూపిటర్ ద్విచక్రవాహనం విడుదల


ద్విచక్ర వాహనాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ తన న్యూజూపిటర్ 110 సీసీ ద్విచక్రవాహనాన్ని ఖమ్మం మార్కెట్‌లోకి విడుదల చేసింది. నగరంలోని వజ్ర టీవీఎస్ షోరూంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరపాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ హాజరై ద్విచక్ర వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వజ్ర టీవీఎస్ షోరూం ఎండీ దినేశ్ మాట్లాడుతూ.. నూతన టీవీఎస్ జూపిటర్ ద్విచక్రవాహనం ఎక్స్ షోరూం ధర రూ.77,100కే అందుబాటులోకి తీసుకొచ్చామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి శరత్, టీవీఎస్ కంపెనీ టెరిటరీ మేనేజర్ సీఎస్ సునీల్, షోరూం జనరల్ మేనేజర్ శ్రీనివాస్, సేల్స్ మేనేజర్ మురళి, ఉద్యోగులు పాల్గొన్నారు.

భద్రాద్రి సహకార బ్యాంకు వార్షికోత్సవం


భద్రాద్రి బ్యాంకు ఛైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తిని సన్మానిస్తున్న సీఈఓ దాసరి వేణుగోపాల్

ఖమ్మం గాంధీచౌక్, న్యూస్‌టుడే: ఖాతాదారులకు నమ్మకమైన సేవలందించటమే భద్రాద్రి సహకార అర్బన్ బ్యాంకు లక్ష్యమని ఛైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి అన్నారు. ఖమ్మం గాంధీచౌక్‌లోని కేంద్ర కార్యాలయంలో వార్షికోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. 17 శాఖలతో రూ.950కోట్లకు పైగా టర్నోవర్‌తో బ్యాంకు పురోగమిస్తోందని తెలిపారు. సభ్యుల వాటా మూలధనంపై అత్యధికంగా డివిడెంట్ 18 శాతం కలిగి ఉందన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్, సూర్యాపేట జిల్లాల్లో తమ బ్యాంకు సేవలందిస్తోందని పేర్కొన్నారు. మరో ఐదు జిల్లాల్లో నూతన శాఖలకు ఆర్‌బీఐ ఆమోదం తెలిపిందన్నారు. ఛైర్మన్‌ను సీఈఓ దాసరి వేణుగోపాల్ సన్మానించారు. డైరెక్టర్లు వేములపల్లి వెంకటేశ్వరరావు, దేవత రాజారావు, మద్ది పిచ్చయ్య, నర్మద, శిల్ప పాల్గొన్నారు.

కార్పొరేషన్ కబుర్లు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ★ ఇంటి పన్ను మదింపు కోసం సొమ్ములు డిమాండ్ చేసి సస్పెన్షన్‌కు గురైనా బిల్‌కలెక్టర్ బుర్రి విజయ్‌కుమార్‌పై శాఖపరమైన విచారణ చేసేందుకు డీఈఈ మాధవిని కమిషనర్ అభిషేక్ అగస్త్య నియమించారు. 15 రోజుల్లో నివేదిక సమర్పించాలని సూచించారు. ★ కుటుంబ డిజిటల్‌కార్డుల జారీచేసిన చేపట్టిన సర్వే వివరాలను ఏరోజు కారోజు ఆన్‌లైన్ చేసే ప్రక్రియను చేపట్టారు. ఆదివారం నాటికి ఈ ప్రక్రియను పూర్తిచేయనున్నారు. నగరంలోని 54 డివిజన్‌లో 12 బృందాలు, రఘునాథపాలెం మండలం రాములుతండాలో రెండు బృందాలు సర్వే నిర్వహిస్తున్నాయి. ★ 48వ డివిజన్‌లో కార్పొరేటర్ గోవిందమ్మ మొక్కలు పంపిణీ చేశారు.

బతుకమ్మ సంబురాలు.. మహిళల ఆనందాలు


ఖమ్మం: గీతాంజలి విద్యానికేతన్‌లో బతుకమ్మ సంబరాల్లో డైరెక్టర్ పద్మ తదితరులు


ఖమ్మం: టైనీటాట్స్ హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో డైరెక్టర్ శెట్టి భాస్కర్ తదితరులు


బతుకమ్మల వద్ద పూజలు చేస్తున్న జిల్లా జడ్జి రాజగోపాల్ దంపతులు

ఖమ్మం వైద్యవిభాగం, ఖమ్మం కమాన్‌బజార్, ఖమ్మం సాంస్కృతికం, ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: బతకమ్మ పండగ వేళ ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థినులు సందడి చేశారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో జరిగిన మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ సంబురాలు సందడిగా చేపట్టారు. అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

★ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను మహిళలు ఆటపాటలు, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాలను ఆయన ప్రారంభించారు. . న్యాయాధికారులు వి.అపర్ణ, వి.మాధవి, ఆర్.శాంతిలత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చింతనిప్పు వెంకట్, న్యాయవాదులు మందడపు శ్రీనివాసరావు, వై.శ్రీనివాసరావు, మలీదు నాగేశ్వరరావు, తొండపు వెంకటేశ్వరరావు, శివకుమార్, వెంకట్ గుప్తా, మహిళా ప్రతినిధి తన్నీరు లలిత పాల్గొన్నారు.


ఖమ్మం: త్రివేణి ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ తదితరులు


బతుకమ్మలతో మహిళా న్యాయవాదులు


1098 ఆకృతిలో పూలను పేర్చి బతుకమ్మ ఆడుతున్న మహిళలు

విద్యుత్తు ఉద్యోగుల ఐకాస నిరసన

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: రామగుండంలో 62.5 మెగావాట్ల విద్యుత్ థర్మల్ కేంద్రం స్థానంలో 800 మెగావాట్ల థర్మల్ కేంద్రం నిర్మిస్తున్నారని, ఆ నిర్మాణంలో సింగరేణి భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ ఖమ్మంలో విద్యుత్తు ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. థర్మల్ కేంద్రాన్ని టీజీ జెన్కో ద్వారా నిర్మించాలని డిమాండ్ చేశారు. ఏడీఈ నాగమల్లేశ్వరరావు, ఎం.నాగరాజు, మందడపు సత్యనారాయణరెడ్డి, ఎం.ప్రసాద్, సీతారాం గోపాల్, పుష్పరాణి తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్తు ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఒరిగిన మహావృక్షం



మూడు రోజుల క్రితం వచ్చిన గాలివానకు 150 ఏళ్ల చరిత్ర కలిగిన మర్రిచెట్టు నెలకొరిగింది. సాయంత్రం వేళ, వేసవి కాలంలో ఈ చెట్టు నీడన ఎంతో మంది సేదతీరేవారు. కొన్ని సమయాల్లో ఇది రచ్చబండగా ఉండేది. అది కూలిపోవడంతో దానితో అనుబంధం ఉన్న వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ డీఆర్ఎఫ్ సిబ్బంది దానిని తొలగించే పనులు శుక్రవారం ప్రారంభించారు. వృక్షం నెలకొరగడంతో సి.సి. రహదారి ధ్వంసమైంది. – ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఇంకెన్నాళ్లీ అవస్థలు..?



ఖమ్మం జిల్లా కేంద్రంలోని వైరా రోడ్డు వెంట వాహనాల రాకపోకలు స్తంభించటం సర్వసాధారణమైంది. అనేక ఆసుపత్రులకు పార్కింగ్ స్థలం లేకపోవటంతో రోగులు, వారి బంధువులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అనేక ఆసుపత్రులకు సెల్లార్లు లేకపోవటంతో రోగులూ అవస్థలు పడుతున్నారు. ఈ అంశంపై నగరపాలక సంస్థ డీసీపీ(డిప్యూటీ సిటీ ప్లానర్) వికాస్ ‘ఈనాడు’తో మాట్లాడుతూ పార్కింగ్ ఇబ్బందులను గుర్తించి తగిన చర్యలు చేపడతామన్నారు. – ఈనాడు, ఖమ్మం, న్యూస్‌టుడే, ఖమ్మం వైద్యవిభాగం